ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025



సత్వరమే పంట నష్ట పరిహారం చెల్లించాలి

పార్వతీపురం, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ఏనుగుల కారణంగా ధ్వంసమైన పంటలకు సత్వరమే నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి డీఎఫ్‌వోను ఆదేశించారు. గజరాజుల వల్ల సుమారు 50 ఎకరాల్లో వరి, మొక్క జొన్న తదితర పంటలను నష్టపోయామని పార్వతీపురం మండలం మరికి కృష్ణపల్లికి చెందిన పలువురు రైతులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన డీఎఫ్‌వో ప్రసూనాతో మాట్లాడారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందజేయాలని సూచించారు. ఏనుగుల తాత్కాలిక విశ్రాంతి కేంద్రం పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

దసరా సందడి

- కిటకిటలాడిన మార్కెట్లు
- నేడు విజయదశమి
- పూజలకు సిద్ధమైన జిల్లావాసులు



రద్దీగా సాలూరు మార్కెట్

పార్వతీపురం/ పార్వతీపురంటౌన్/పాలకొండ, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): దసరాకు ఘనంగా నిర్వహించేందుకు మన్యం వాసులు సన్నద్ధమయ్యారు. గురువారం ఘనంగా పండుగ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పూజకు అవసరమైన సామాగ్రి, ఇతర వస్తువుల కొను గోలుకు బుధవారం మార్కెట్లకు పోటెత్తారు. దీంతో జిల్లాలో ప్రధాన కూడళ్లు, రోడ్లు, పలు షాపులు రద్దీగా మారాయి. పాలకొండ, కురుపాం నియోజకవర్గాలతో పాటు మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాగా పూజా సామాగ్రి, పండ్లు, పూల ధరలు అమాంతం పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. పండుగ కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా సామాగ్రిని కొనుగోలు చేశారు. పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారి రాత్రి 7 గంటల వరకు కొనుగోలు దారులతో కిటకిటలాడింది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజల తరలి వచ్చి పూజా సామాగ్రి, ఇతర నిత్యవసర సరుకుల కొనుగోలు చేశారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల తర్వాత వరుణుడు శాంతించడంతో కొనుగోళ్లు ఊపందు కున్నాయి. సాలూరు మెయిన్‌రోడ్డులో తరచూ ట్రాఫిక్ నిలిచి పోవడంతో వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డారు. మరోవైపు వాహనాలను శుభ్రం చేసేందుకు వాహనదారులు వాషింగ్ సెంటర్ల వద్ద క్యూ కట్టారు. దసరా సందర్భంగా జిల్లాలో ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. కొందరు వాహనాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. జీఎస్టీ తగ్గడంతో జిల్లాలో వాహన విక్రయాలు పెరిగాయి. విజయదశమి రోజున వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ వాహనాలను వినియో గించనున్నారు. అయితే భక్తుల రద్దీ దృష్ట్యా దేవాలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొండెక్కిన కోడి, మేక, గొర్రెల ధరలు..

ఈ ఏడాది దసరా గురువారం పడినప్పటికీ చాలామంది కోళ్లు, గొర్రెలు, మేకలను మొక్కు బడులుగా చెల్లిస్తుంటారు. అయితే ఇదే అదునుగా కొంతమంది మార్కెట్‌లో కృత్రిమ డిమాండ్ సృష్టిస్తున్నారు. కిలో నాటుకోడి రూ.1500 నుంచి రూ.1800 ధర పలుకుతుంది. పది కిలోలు పడే గొర్రె, మేకలైతే రూ.12 వేలు వరకు ధర పలుకుతుంది. ఇప్పటికే వివిధ సంతల్లో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లన ప్రజలు కొనుగోలు చేశారు. అమ్మవారి పూజకు తప్పనిసరి కావడంతో ఎవరూ వెనుకంజ వేయడం లేదు. కాగా ప్రస్తుత రోజుల్లో నాటుకోళ్ల పెంచడం సాధ్యం కావడం లేదు. ఓ వైపు కోళ్లకు అంతుపట్టని వ్యాధులు , మరోవైపు వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో పెంపకందారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇదే సమ యంలో పౌల్ట్రీలో పెంచే వివిధ హైబ్రీడ్ కోళ్లను నాటుకోళ్లుగా చెప్పి పెంప కందారులు కొనుగోలుదారులకు అంటకడుతున్నారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ పౌల్ట్రీలో పెంచిన మేకలు, గొర్రెలను కూడా ఇక్కడకు తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. నాటు ఏదో, పౌల్ట్రీలో పెంచిందేదో తెలియక వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



నేడు సాలూరులో మాంసం విక్రయాలు బంద్

సాలూరు రూరల్: సాలూరు మున్సిపల్ మార్కెట్‌లో గురువారం మాంసం విక్రయాలు నిలిపివేయాలని మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్

(మిగతా 10వ పేజీలో...)



కొనుగోలుదారులతో పార్వతీపురం ప్రధాన రహదారి ఇలా..

పీహెచ్‌సీ వైద్యుల నిరసన

బెలగాం, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యుల సంఘం రాష్ట్ర నాయకులు వినోద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట పీహెచ్‌సీ వైద్యులు నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఇన్ సర్వీసెస్ పీజీ కోటాను పునరుద్ధరిం చాలని, టైం బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బేసిక్ పే 50శాతం పెంచాలని, ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

గిరిజన వర్సిటీ సమీపంలో గ్రేహౌండ్స్ క్యాంపస్

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- దత్తిలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయనగరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గిరిజన విశ్వవిద్యాలయం సమీపంలో త్వరలో గ్రేహౌండ్స్ క్యాంపస్ వస్తుందని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి ఉమ్మడి జిల్లాలో చివరి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. గజపతి నగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్ర బాబు ప్రసంగించారు. రాష్ట్రంలో వ్యవస్థలను బాగుచేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో విజయనగరం జిల్లా ప్రపంచానికి కనెక్టు అవుతుందన్నారు. ● ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పండుగ చేపడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తు న్నామన్నారు. 1985లో అన్న ఎన్టీఆర్ రూ.30తో పింఛన్ పథకాన్ని ప్రారంభించారని

(మిగతా 10వ పేజీలో...)



సభకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

ఆర్భాటాలకు దూరంగా..! 8లో
● విజయనగరం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన
● నాడు జగన్ వస్తే.. పరదాలు, నిర్బంధాలు
● అప్పటి, ఇప్పటి పరిస్థితులను బేరీజు వేసుకున్న ప్రజలు

సీఎం సభకు జిల్లా ప్రజాప్రతినిధులు 10లో

రేపటి నుంచి రీ సర్వే 10లో

జలపాతం వద్ద ప్లాస్టిక్ నిషేధం
● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ 8లో

ప్రాణాలు పోతున్నాయ్!

- కురుపాం గురుకుల బాలికల పాఠశాలలో జాండీస్ కలకలం
- వారం వ్యవధిలో ఇద్దరు విద్యార్థినుల మృతి
- ఆ లక్షణాలతో పలు ఆసుపత్రుల్లో మరికొందరికి చికిత్స
- ఆందోళనలో తల్లిదండ్రులు

పార్వతీపురం/కురుపాం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షే మ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠ శాలలో పదుల సంఖ్యలో విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుతుండడం కలకలం రేపుతోంది. వారం వ్యవధిలో ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు జాండీస్ లక్షణాలతో మృతి చెందడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థి నులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాం దోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే..



అంజలి (ఫైల్)



కల్పన (ఫైల్)

దసరా సెలవులు ఇచ్చిన తర్వాత ఈ పాఠశాల విద్యార్థినులు స్వగ్రామాలకు వెళ్లారు. అయితే అలా వెళ్లిన వారిలో గుమ్మలక్ష్మీపురం మండలం కంబగూడకి చెందిన పువ్వల అంజలి జాండీస్ లక్షణాలతో గతనెల 26న మృతి చెందింది. తాజాగా బుధవారం కురుపాం మండలం దండుసూర గ్రామానికి చెందిన తోయక కల్పన విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించింది. మరోవైపు ఈ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు పచ్చకామెర్ల లక్షణాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతు న్నారు. సీమల నీరజ అనే విద్యార్థిని విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండ గా, పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ఏడు గురు, కురుపాంలో సీహెచ్‌సీలో ఐదు గురు, మరికొందరు గుమ్మలక్షీపురం, చిన మేరంగి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతు న్నట్లు తెలిసింది. కాగా ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. పాఠశాల విద్యార్థినుల వివరాలు సేకరించి.. క్షేత్ర స్థాయి సిబ్బందికి తగు ఆదే శాలు జారీ చేసింది. దీంతో ఎన్ఎంఎం, ఆశావర్కర్లు ఆయా విద్యార్థినుల ఇంటికి వెళ్లి ఆరో గ్యంపై ఆరా తీశారు. అనా రోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినులను ఆసు పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే వారంతా జాండీస్ లక్ష ణాలతో బాధపడుతున్నట్లుగా వైద్య సిబ్బంది గుర్తించినట్లు తెలిసింది. దీనిపై ప్రిన్సిపాల్ అనూరాధను వివరణ కోరగా..' కురుపాం గిరిజన సం క్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్

(మిగతా 10వ పేజీలో...)

పేదల సంక్షేమమే లక్ష్యం

- పింఛన్ల పంపిణీలో మంత్రి సంధ్యారాణి



కూర్మరాజుపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి

సాలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారం సాలూరు మండలం కూర్మరాజుపేటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్ర బాబు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తూ.. వృద్ధులు, దివ్యాం గులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులకు భరోసా కల్పిస్తున్నారని తెలి పారు. అర్హులకు పింఛన్ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు

ఇంటింటికీ వెళ్లి..

గరుగుబిల్లి: ఉల్లిభద్రలో బుధవారం కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. పింఛన్లు పంపిణీ అనేది సంక్షేమమే ఒక్కటే కాదని, ప్రజలపై ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక బాధ్యతని తెలిపారు. జిల్లాలో 1,40,066 మంది పింఛన్‌దారులకు ప్రతి నెలా రూ. 60 కోట్లకు పైబడి అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మంచంపై ఉన్న దీర్ఘకాలిక పింఛన్‌దారునికి నగదు అందించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి.. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయంలోగా పింఛన్లు అందిం చాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నేరుగా ఇంటి వద్దకే వెళ్లి సొమ్ము అందజేయాలని , నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, ఎంపీడీవో జి.పైడితల్లి తదితరులు ఉన్నారు. కాగా జిల్లాలో తొలిరోజు పింఛన్లు పంపిణీ 91 శాతం మేర జరిగింది. 1,25,426 మందికి రూ. 53.21 కోట్లు అందించారు.

బొబ్బిలి కోటలో ఆయుధ పూజ 8లో
● తిలకించిన ప్రజలు

నేటి నుంచి తోటపల్లిలో బ్రహ్మోత్సవాలు 8లో

ప్రతీ విద్యార్థి డిగ్రీ పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



పార్వతీపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ విద్యార్థి డిగ్రీ పూర్తి చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. అడ్మిషన్ల కోసం ఎటువంటి సర్టిఫి కెట్ అవసరం లేదని, అపార్ ఐడీ పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పెన్) ఉంటే చాలని ఆయన తెలిపారు. డిగ్రీ లేకుండా ఎవరూ ఉండరాద న్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బడిమానేసిన పిల్లల జాబితాను సిద్ధం చేసి, వారు ఏమి చేస్తున్నారో తెలుసుకోవాలన్నారు. తిరిగి వారిని పాఠశాలల్లో చేర్పించా లన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు హెచ్‌బీ లెవెల్స్ ఎక్కువ ఉండేలా చూడాలన్నారు. ● పార్వతీపురం రూరల్: అడ్డాపుశీల ప్రాంతంలో కలెక్టరేట్ నిర్మాణానికి గతంలో ప్రతిపాదించిన స్థలాన్ని బుధవారం కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పార్వతీపురం తహసీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.

మహిషాసురమర్దినిగా కోటదుర్గమ్మ

పాలకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోట దుర్గమ్మ బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచే

(మిగతా 10వ పేజీలో...)



రేపటి నుంచి కొత్త గురువులకు శిక్షణ

సాలూరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త గురువులకు ఈ నెల 3 నుంచి 10 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు విజయనగరం జిల్లా డెంకాడ మండలం, మోదవలస ఓయోస్టార్ స్కూల్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలో 583 పోస్టులకు గాను 578 మందిని ఎంపిక చేశారు. మరో ఐదు పోస్టులకు అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో ఖాళీగా మిగిలిపోయాయి. ఎంపికైన కొత్త గురువులకు గత నెల 25న అమరావతిలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. కాగా 578 మంది పోస్టులకు ఎంపికైన 321 మంది పురుషులు, 257 మంది మహిళలకు మోదవలసలో రెండు వేదికల్లో శిక్షణ నివ్వనున్నారు. విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జోన్ పోస్టులకు ఎంపికైన 390 మందికి కూడా రెండు వేదికల్లో శిక్షణనివ్వనున్నారు. అల్లూరి జిల్లా అరకులో గుడ్ మార్నింగ్ రిసార్ట్‌లో 198 మందికి, మోదవలస ఓయో స్టార్ స్కూల్ లో 192 మందికి శిక్షణ ఇస్తారు. ఈ మేరకు రిసోర్స్‌ప ర్సన్‌ను అలాట్ చేశారు. ఇక రాష్ట్రస్థాయి పోస్టుల కు ఎంపికైన 243 మందికి ఏలూరులో శిక్షణనివ్వనున్నారు.

ఆర్భాటాలకు దూరంగా..!

- జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన
- నాడు జగన్ వస్తే.. పరదాలు, నిర్బంధాలు
- అప్పటి, ఇప్పటి పరిస్థితులను బేరీజు వేసుకున్న ప్రజలు



ప్రజా వేదిక వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

విజయనగరం/ గజపతినగరం/ కలెక్టరేట్/ మెంటాడ/ దత్తిరాజేరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎలాంటి హడావుడి లేదు. ఆర్భాటం లేదు. అధికారుల ఉరుకులు లేవు.. పరుగులు లేవు. ట్రాఫిక్ ఆంక్షలు, ఆర్టీ సీ బస్సుల మళ్లింపు, ప్రైవేటు స్కూల్ బస్సుల తర లింపు లేనేలేదు. జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన బుధవారం ఆర్భాటం లేకుండా సాగింది. ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. సామాజిక పింఛన్ల పంపిణీ కోసం బుధవారం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామాని కి వచ్చిన సీఎం చంద్రబాబు పర్యటన చాలా సాధార ణంగా సాగింది. ప్రతినెలా పింఛన్ల పంపిణీకి సీఎం ఏదో ఒక జిల్లాకు వెళ్తున్నారు. ఈసారి విజయనగరం జిల్లాకు వచ్చారు. అయితే గత ప్రభుత్వంలో ఉన్న పరి స్థితులకు భిన్నంగా సీఎం పర్యటన సాగడం విశేషం. నాడు సీఎం జగన్ జిల్లాకు వస్తున్నారంటే తొలుత రహ దారుల దిగ్బంధం జరిగి పోయేది. పోలీసుల ఆధీనం లోకి వెళ్లిపో యాయి. ట్రాఫిక్‌ను వేరే రూట్లలో మళ్లించేవారు. పట్టణా లు, గ్రామాలను తమ అదుపులోకి తెచ్చుకునేవారు. ప్రజలకు రవాణా కష్టాలు చూపేవారు. సీఎంగా జగన్ జిల్లాకు వస్తే ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్సు లను మళ్లించేవారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సైతం బస్సులు సర్దుబాటు చేసిన సందర్భాలున్నాయి. ఆ రోజు ప్రైవేటు పాఠశాలలకు అప్రకటిత సెలవులను సైతం ప్రకటించేవారు. స్కూల్ బస్సులను జనం తర లింపునకు వినియోగించుకునేవారు. రవాణా శాఖ అధికారులతో భయపెట్టి మరి తరలించుకుపోయేవారు. సీఎం వస్తున్నారంటే ఆ శాఖ ఈ శాఖ కాదు అన్ని శాఖలకు పనిచెప్పేవారు. సీఎం వస్తున్న రూట్‌లో పరదాలు కట్టే బాధ్యతను ఆర్‌అండ్‌బీకి అప్పగించేవారు. అడ్డంగా ఉందని చెట్లను సైతం నరికివేసేవారు. రోడ్డు డివైడర్లను ధ్వంసం చేసిన సందర్భాలున్నాయి. హెలిపాడ్ నుంచి సభ వరకూ ఫ్లెక్సీలతో నింపేసేవారు. ఇక డ్వాక్రా మహిళల తరలింపును ఉద్యమంలా చేపట్టే వారు. తప్పకుండా సభలకు హాజరు కావాల్సిందేనని తేల్చిచెప్పేవారు. సంబంధిత శాఖ అధికారులు, పర్య వేక్షకులతో ఫోన్‌లో హెచ్చరిక మెసేజ్‌లను సైతం పంపే వారు. సీఎం సభల్లో గలాటా జరగకుండా ఉపాధ్యాయ సంఘాల నేతలను నియమించిన సందర్భాలున్నాయి. సీఎం వస్తున్నాడంటే ముందురోజే ప్రజాసంఘాల నేతలను అదుపులోకి తీసుకునేవారు. వామపక్షాల నేతలను గృహనిర్బంధం చేసేవారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి సిబ్బందిని నియమించేవారు. బుధవారం నాటి సీఎం చంద్రబాబు సభలో మచ్చుకైనా ఈ దృశ్యాలు కనిపించలేదు. కేవలం దత్తి గ్రామస్థుల వరకూ కార్యక్రమాన్ని పరిమితం చేశా రు. ఆంక్షలు లేవు. ఎటువంటి నిబంధనలు, హెచ్చరి కలు లేవు. అన్నింటికీ మించి ప్రజా జీవనానికి విఘా తం కలిగించలేదు. ప్రజలంతా వైసీపీ హయాంను గు ర్తు చేసుకున్నారు. కనీసం సీఎం చంద్రబాబు వస్తున్న విషయం పక్క మండలానికి తెలియని విధంగా సాగి పోయింది. దత్తి గ్రామస్తులతో మమేకమైన తీరు అభినందనలు అందుకుంటోంది.



ఎంపీ కలిశెట్టి అందజేసిన వినతిపత్రాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

బంగారు కుటుంబాలతో ముఖాముఖి

- అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.5 లక్షలు

దత్తిరాజేరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దత్తిలో నిర్వహించిన ప్రజా వేదికలో ముఖ్యమంత్రి బంగారు కుటుంబాలు, మార్గదర్శిలతో ముఖాముఖి అయ్యారు. భర్త లేని తంతిపాకుల నాగ మణికి కుమార్తె, కుమారుడు ఉన్నారని, కుమార్తె ఇంటర్ చదివి మానే సిందని, ఆమెకు బీఎస్సీ నర్సింగ్ చదవాలని ఉందని తెలిపారు. మార్గ దర్శి తాడ్డి త్రినాథరావు ఆమెకు బీఎస్సీ నర్సింగ్ చేయించే బాధ్యత తీసుకున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. కుమారునికి డిగ్రీ పాస్ అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. అంతేకాకుండా నాగమణి కి కిరాణాషాపు పెట్టుకునేలా తోడ్పడి, అదనపు ఆదాయం వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. మరో బంగారు కుటుంబం ధనుంజయనాయుడు అనారోగ్య సమస్యతో బాధపడుతూ తన అన్న పిల్లలకు కూడా తానే దిక్కు అయ్యానని వివరించగా.. సీఎం స్పందించి ఆయన ఆరోగ్య ఖర్చుల కోసం రూ.5 లక్షల ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈమేరకు కలెక్టర్‌ను ఆదేశించారు. సమావేశం ముగిసిన తర్వాత రూ.5 లక్షలను చెక్కు రూపంలో లబ్ధిదారుడికి అక్కడికక్కడ కలెక్టర్ అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌పాణి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న కలెక్టర్

గజపతినగరం నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు వరాల జల్లు

- రూ.27 కోట్లతో సార్వగడ్డ పనులకు ఆమోదం

గజపతినగరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గజపతినగరం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరాల జల్లు కురిపించారు. ఆయన బుధవారం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామం పర్యటనకు వచ్చారు. ఈసందర్భంగా నియోజకవర్గం అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. సార్వగడ్డ పనులకు రూ.27 కోట్లు కేటాయించి, రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత కూటమి ప్రభు త్వం తీసుకుందన్నారు. మెంటాడకు వెళ్లే బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మర్రివలస మినీ వంతెన ఏర్పాటుకు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గ పరిధిలోని జామి మండలంలో శాసనాపల్లి గెడ్డపై మినీ వంతెన ఏర్పాటకు చర్యలు తీసుకుంటామన్నారు. దత్తి గ్రామంలో 704 మందికి పింఛన్లు అందజేస్తామని చెప్పారు.

మూడు డ్రోన్‌లతో నిఘా..

దత్తి గ్రామంలో నిర్వహించిన సీఎం సభకు పోలీసులు మూడు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. హెలిప్యాడ్ వద్ద ఒకటి, ప్రజావేదిక వద్ద ఒకటి, పార్టీ నాయకుల సమావేశం వద్ద ఒక దానితో పర్యవేక్షించారు. పూసపాటిరేగ గ్రామానికి చెందిన రామకృష్ణ అనే దివ్యాంగుడు చంద్రబాబునును చూసేందుకు అభిమానంతో వచ్చారు.



చంద్రన్న కోసం..

చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక తమ నియోజకవర్గానికి తొలిసారి రావడంపై గజపతినగరం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం నుంచే ఆయన రాకకోసం ఎదురు చూశారు. చిన్నాపెద్ద తేడా లేకుండా మిద్దెలు ఎక్కారు. చంద్రబాబు హెలీక్యాప్టర్ దిగగానే తమ మొబైల్ ఫోన్లలో ఫొటోలు తీశారు. రోడ్డు పక్కన ఉన్న వారు 'సార్.. మావైపు చూడండి' అంటూ పిలిచారు. ముఖ్యంగా వృద్ధులు చంద్రబాబు రాకకోసం ఆసక్తిగా ఎదరు చూశారు. తమకు పింఛన్ డబ్బులు పెంచిన సారు వస్తున్నారంటూ వారు చర్చించుకోవడం కనిపించింది. కొందరైతే చంద్రబాబు కనిపించగానే రెండు చేతులెత్తి దండం పెట్టారు. సీఎం దగ్గరకు రాగానే ప్రజలు ఆయన షేక్‌హ్యాండ్ కోసం ఎగబడ్డారు.



అడిగడిగో చంద్రన్న వస్తున్నాడు



తమ అధినేత కోసం ఎదురు చూస్తూ..



హెలీకాప్టర్ దిగి ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం చంద్రబాబు



సీఎం వస్తున్నారు.. త్వరగా ఫొటో తీయ్‌రా



దండాలయ్యా..



సీఎం సార్.. (దారి పొడవునా పలకరింపు)



ఇటు కాదు.. అటు చూడు.. సీఎం వస్తున్నారు



చంద్రబాబు సార్.. షేక్‌హ్యాండ్ ఇవ్వండి



నేటి నుంచి తోటపల్లిలో బ్రహ్మోత్సవాలు

గరుగుబిల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో గురువారం నుంచి బ్రహ్మో త్సవాలు నిర్వహించ నున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయదశమిని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతామని పేర్కొ న్నారు. 5న నాగావళి నదీ తీరంలో స్వామి వార్లకు శ్రీచక్రతీర్థ స్నానం నిర్వహిస్తామన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

జలపాతం వద్ద ప్లాస్టిక్ నిషేధం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్



మెట్టుగూడ జలపాతం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

సీతంపేట రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో మెట్టుగూడ జలపాతం వద్ద ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం జలపాతం ప్రవేశ ద్వారం వద్ద ప్లాస్టిక్ నిషేధం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ సంచులను ఎవరూ తీసుకురాకూడదని పేర్కొన్నారు. పర్యాటకులు సబ్బులు, షాంపూలు వంటివి కూడా తీసుకురాకూడదని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై తమ సహకరించాలని సూచించారు. నిబంధనలకు అతిక్రమించిన వారికి రూ.500 జరిమానా విధిస్తామన్నారు.

బొబ్బిలి కోటలో ఆయుధ పూజ

- సోదరులతో కలిసి పాల్గొన్న మాజీ మంత్రి సుజయ్
- రాజరికపు మర్యాదలతో దర్బార్‌హోల్‌లోకి ప్రవేశం
- తిలకించిన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు



రాజవంశీయులు (ఎడమ నుంచి బేబీనాయన, సుజయ్‌నాయన, రామ్‌నాయన)

బొబ్బిలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలో బుధవారం ఆయుధ పూజ అంగరంగ వైభవంగా జరిగింది. రాజవంశీయులైన మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు, సోదరులు రామకృష్ణరంగారావు, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)తో కలిసి ఈ ఆయుధ పూజను స్థానిక దర్బార్ మహల్‌లో చేపట్టారు. ఈ పూజా ప్రక్రియను తిలకించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చారు. నాటి రాజులు వినియోగించిన బంగారు, వెండి సింహాసనాలను ప్రధాన కోట నుంచి దర్బారు మహల్‌కు మేళతాళాలతో... వందిమాగధులు, పరివారం కలిసి సంప్రదాయసిద్ధంగా తోడ్కొని వచ్చారు. అనంతరం ముగ్గురు సోదరులు నాటి రాజుల మాదిరిగా వజ్ర వైడూర్యాలతో కూడిన తలపాగాలు, ఆభరణాలు, దుస్తులు ధరించి పూజాస్థలానికి చేరుకున్నారు. వారి వెంట కోటలో పనిచేసే ఉద్యోగులంతా పరివారంగా ప్రత్యేక అలంకరణతో అనుసరించారు. దర్బారు మహల్‌లో అగ్రభాగాన స్వర్ణసింహాసనాన్ని ఏర్పాటు చేసి రెండు వైపులా వెండి సింహాసనాన్ని, సాదా సింహాసనాన్ని ఏర్పాటు చేశారు. స్వర్ణ సింహాసనంపై దివంగత బొబ్బిలి రాజా, నాటి మద్రాసు ఉమ్మడి రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు (బొబ్బిలి రాజవంశంలో ఆఖరి పట్టాభిషిక్తులు) చిత్రపటాన్ని, వెండి సింహాసనంపై ఆయన తనయుడైన మాజీ ఎంపీ ఆర్‌వీజీకే రంగారావు (సుజయ్ తండ్రి) చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మరో సముచితాసనంపై ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయరు స్వామి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. పూజలో భాగంగా వెండి కంచాలలో విలువైన నైవేద్యాలను సమకూర్చారు.



స్వర్ణ, రజత సింహాసనాలు

- చారిత్రాత్మకమైన బొబ్బిలియుద్ధంలో నాటి రాజులతో పాటు, బొబ్బిలి వీరునిగా పేరుగాంచిన తాండ్ర పాపారాయుడు, ఇతర సైన్యం వినియోగించిన తుపాకులు, కత్తులు, డాళ్లకు వేదపండితుడు భద్రం శ్రీకాంత్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ తంతును తిలకించేందుకు ఆసక్తి చూపారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సీనియర్ నేతలు, నియోజకవర్గ పరిధిలోని నాయకులు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంప్రదాయాలను గౌరవించుకోవాలి..

కోటలో ఆయుధ పూజ అనంతరం ఎమ్మెల్యే రాజవంశీయుడైన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన), సుజయ్‌లు విలేకరులతో మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ వాటిని అలా కాపాడుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలనాటి బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, స్వర్ణ, రజత సింహాసనాలతో పాటు తాము ప్రస్తుతం వినియోగిస్తున్న అన్ని రకాల వాహనాలకు ప్రత్యేక పూజలు చేశామన్నారు. నవరాత్రి మహోత్సవాలను ఘనంగా జరుపుకుంటూనే ఆఖరి రోజున ఆయుధ పూజ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

-మాజీ మంత్రి సుజయ్, ఎమ్మెల్యే బేబీనాయన

నగరవాసులకు దసరా శుభాకాంక్షలు

విజయనగరం టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో నగరవాసులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

మాంసం విక్రయాలు చేపడితే చర్యలు

విజయనగరం టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఎక్కడైనా మాంస విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాంధీ జయంతి కావున నిబంధనలను అతిక్రమించి పశువధ, మాంస విక్రయాలు చేపడితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. వీటిని నిరోధించేందుకు నగరవ్యాప్తంగా ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

రేపటి నుంచి రీసర్వే

ఎస్.కోట రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండలంలో మూడో దశలో భాగంగా మూలబొడ్డవర, కొత్తూరు గ్రామాల్లో రీసర్వే చేస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బొడ్డవర పరిధిలో 666 ఎకరాలు, కొత్తూరులో 865 ఎకరాలు రీసర్వే చేస్తారని చెప్పారు. రైతులు 3వ తేదీ నుంచి గ్రామసభ అవగాహన ర్యాలీకి హాజరు కావాలని ఆయన కోరారు. ● నెల్లిమర్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అలుగోలు గ్రామంలోని 2,200 ఎకరాలకు సంబంధించి రీసర్వే కోసం బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కె.శ్రీకాంత్, ఆర్ఎస్‌డీటీ సత్యనారాయణ, మండల సర్వేయర్ వెంకటరావులు మాట్లాడు తూ ఈనెల 3 నుంచి రీసర్వే ప్రారంభిస్తామని తెలిపారు.

అన్నదాన కార్యక్రమాలకు రూ.5.20 లక్షల విరాళం

భోగాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి నవరాత్రులు సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే ఉత్సవాల కమిటీ సభ్యులకు టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు రూ.5.20 లక్షలు విరాళం ఇచ్చారు. బుధవారం ఆయన ఈ మొత్తాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.

రక్తదాతలకు సత్కారం

రాజాం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ ఆధ్వర్యంలో పలువురు రక్తదాతలను సత్కరించారు. పట్టణానికి చెందిన బూరాడ శివకృష్ణ, జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఉద్యోగి చీకటి కేశవరావు, వారణాసి రమేష్, కొండవీటి కోటేశ్వరరావులను రెడ్‌క్రాస్ రాజాం శాఖ అధ్యక్షుడు కొత్త సాయిప్రశాంత్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, పర్యావరణ కన్వీనర్ ఆర్‌వీజీ నాయుడు, మానవతా కార్యదర్శి నీలకంటేశ్వర యాదవ్‌లు సత్కరించారు.

పోరాట ఫలితమే మున్సిపల్ కార్మికుల ఉద్యోగాల భర్తీ



హర్షం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికుల యూనియన్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా పాలకులు స్పందించి పారిశుధ్య కార్మికుల ఖాళీలను భర్తీ చేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. బుధవారం స్థానిక వుడా పార్కు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఏడాది కాలంగా తాము చేసిన పోరాటాల ఫలితంగా 45 మంది కార్మికుల పోస్టులను భర్తీ చేశారని చెప్పారు. అలాగే మిగిలిన ఖాళీలను కూడా భర్తీ చేయాలని ఆయన కోరారు.

ఐక్య ఉద్యమాలతోనే విజయాలు

వేపాడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల చట్టబద్ధత హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలే మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టీవీ రమణ అన్నారు. వేపాడలో బుధవారం నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాలు కనీస వేతన చట్టాన్ని అమలు చేయ కుండా కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి చల్లా జగన్ అధ్యక్షత వహించగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.అప్పారావు, వీఆర్‌ఏలు, ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు చెల్లించాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం వసూలు చేసిన ట్రూఅప్ చార్జీలను ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే చెల్లించాలని సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు రెడ్డి నారాయణరావు బుధవారం ఒక ప్రకటన లో కోరారు. గత 15 ఏళ్ల కిందట కట్టిన విద్యుత్ బిల్లుల్లో గత ఐదేళ్ల నుంచి ట్రూఅప్ చార్జీ లు వసూలు చేయడమే చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
● కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



విజయనగరం రూరల్: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



మెరకముడిదాం: పింఛన్ సొమ్ము అందజేస్తున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు



వేపాడ: పింఛన్ల పంపిణీలో ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యేలు అన్నారు. జిల్లాలో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు.

హామీ నిలబెట్టుకున్నారు

విజయనగరం రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ పెంపు విషయమై ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకుందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. 46వ డివిజన్ కణపాకలో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

మెరకముడిదాం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. బుధవారం గర్భాం గ్రామంలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు టీడీపీ మండలాధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, బైరిపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ తాడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు

రాజాం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంస్కరణలకు ఆద్యుడని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు అన్నారు. పట్టణంలోని లచ్చయ్యపేటలో నూతన రేషన్ డిపోను ఆయన బుధవారం ప్రారంభించారు. పలువురికి రేషన్ అందించారు. అనంతరం స్థానిక కూరాకుల వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.



భోగాపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యం

వేపాడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ స్థాపనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని ముకుందపురం, ఓబలయ్యపాలెం, బొద్దాం గ్రామాల్లో బుధవారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు కొట్యాడ రమణమూర్తి పాల్గొన్నారు.

పింఛన్‌దారుల్లో ఆనందం

భోగాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందడంతో లబ్ధిదారుల్లో ఆనందం కనిపిస్తుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. బుధవారం ముంజేరులో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో స్వరూపరాణి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రజాప్రతినిధులు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, కోండ్రు, అదితి, లలితకుమారి, మంత్రి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ నాగార్జున, టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు రవిశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు

విజయనగరం రూరల్/ ఎస్.కోట/ రాజాం/ నెల్లిమర్ల/ చీపురుపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ప్రజా సేవలో ప్రజావేదిక' కార్యక్రమంలో భాగంగా బుధవారం గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన్ని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కలిసి, ఆహ్వానించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, టీడీపీ విశాఖపట్టణం ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు, డీసీసీబీ చైర్మన్ నాగార్జున ఉన్నారు. వీరితో పాటు మంత్రి శ్రీనివాస్ ఉన్నారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రజాశ్రేయస్సే చంద్రబాబు ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో 15ఏళ్లు పూర్తిచేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం 15కేజీల కేక్‌ను కట్‌చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

భోగాపురంలో భారీ వర్షం

భోగాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో జాతీయ రహదారిపై నీరు నిలిచింది. జాతీయ రహదారిపై నుంచి సర్వీస్ రహదారిపైకి వర్షపునీరు రావడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. అలాగే సర్వీస్ రహదారికి ఇరువైపుల కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.



జాతీయ రహదారి పైనుంచి సర్వీస్‌రోడ్డు పైకి పడుతున్న వర్షపునీరు

ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● ఎస్పీ దామోదర్

దత్తిరాజేరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పెదమానాపురం పోలీసుస్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడారు. బ్లాక్ స్పాట్స్ వద్ద స్టాపర్లు, లైటింగ్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నేర నియంత్రణలో భాగంగా పోలీసు స్టేషన్ పరిధిలో సాధ్యమైనంత ఎక్కువగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తరచూ గ్రామాల్లో పర్యటిస్తుండాలని, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే అంశాలను గుర్తించి వాటిని నియంత్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి, వాటిని ఏ కేసులో సీజ్ చేశారో అడిగి, తెలుసుకున్నారు. వాటికి చట్టపరమైన చర్యలు చేపట్టి రిలీజ్ చేయాలన్నారు. రిసెప్షన్ రిజిస్టర్‌ను తనిఖీచేసి నమోదైన కేసులపై ఆరా తీశారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ దామోదరరావు

పైడిమాంబ సిరిమానోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవ పోస్టర్‌ను దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో జిల్లా చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. ప్రజాసేవ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు బుధవారం దత్తి గ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యేలు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, అనిత, కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, నిమ్మకాయల చినరాజప్ప, కోళ్ల లలిత కుమారి, అదితి గజపతిరాజు, ఎస్.ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పడాల అరుణ, డాక్టరు కేఏ నాయుడు, టీడీపీ నాయకులు కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, ఐవీపీ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేవరకు తమ పోరాటం ఆగదని జిందాల్ నిర్వాసితులు తేగేసి చెబుతు న్నారు. బుధవారం బొడ్డవర గ్రామంలో 103 రోజు నిరసనలో భాగంగా తమ రిలే దీక్షలను వారు కొనసాగించారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.



రిలే దీక్షలో పాల్గొన్న జిందాల్ నిర్వాసితులు

మహిషాసురమర్దినిగా దుర్గాదేవి

● ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
● మండపాల్లో ప్రత్యేక పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. భక్తులు విశేష పూజలు నిర్వహించారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**



భోగాపురం: బొల్లింకలపాలెంలో సామూహిక కుంకుమ పూజలు



విజయనగరం రూరల్: కనకమహాలక్ష్మి ఆలయంలో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి



చీపురుపల్లి: మహిషాసురమర్దినిగా కనకమహాలక్ష్మి



ఎస్.కోట రూరల్: ధర్మవరంలో వారాహీ మాత పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు



రాజాం: నవదుర్గా ఆలయంలో ఎమ్మెల్యే కోండ్రు

రేబీస్‌తో వ్యక్తి మృతి



లింగంనాయుడు (ఫైల్)

సంతకవిటి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రేబీస్ వ్యాధితో ఓ వ్యక్తి మృతిచెందా రు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోవిందపురం గ్రామానికి చెందిన అదపాక లింగంనాయుడు(37) నెల రోజుల కిందట వీధికుక్క దాడిలో గాయపడ్డారు. వెంటనే సంతకవిటి పీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నారు. నెల రోజుల తర్వాత సెప్టెంబరు 25న అనారోగ్యం బారిన పడ్డారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేరారు. అక్కడ వైద్య పరీక్షల్లో రేబీస్ వ్యాధి వచ్చినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు లింగంనాయుడును విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం లింగంనాయుడు మృతిచెందారు. ఈయనకు భార్య హేమలత ఉంది.

వేగావతి నదిలో యువకుడి గల్లంతు



యోగీశ్వరరావు (ఫైల్)

బొబ్బిలి రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జె.రంగరాయపురం సమీపంలో బుధవారం వేగావతి నదిలో స్నానానికి దిగిన పాటోజు యోగీశ్వరరావు(22) అనే యువకుడు గల్లంతయ్యాడు. ప్రస్తుతం ఆ యవకుడు మాల ధారణలో ఉన్నాడు. పట్టణంలోని కంచరవీధికి చెందిన యోగీశ్వరరావు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మరో ఐదుగురు భవానీ భక్తులతో కలిసి వేగావతిలో స్నానం చేసేందుకు దిగాడు. నదిలో నీటి ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో యోగీశ్వరరావుతో పాటు వినయ్, చరణ్ ప్రవాహంలో కొట్టుకుపోయారు. వినయ్, చరణ్‌లు చెట్లపొదలకు చిక్కుకుని ప్రాణాలతో బయటపడ్డారు. యోగీశ్వరరావు నదిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కొండలరావు, ఫైర్ స్టేషన్ హెచ్‌సీ బాలకృష్ణ ఆధ్వర్యంలో నలుగురు సిబ్బంది నదిలో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేదు. యోగీశ్వరరావు పట్టణంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు నదిలో గల్లంతవ్వడంతో తల్లిదండ్రులు వీరాచారి, సుజాత, తమ్ముడు శ్యామ్ కన్నీరుమున్నీరయ్యారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పార్వతీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎం.ఆర్.నగరంలోని చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని ఉండి భీమవరానికి చెందిన వి.గౌరీశంకరరావు నాలుగు నెలలుగా కుటుంబంతో ఎం.ఆర్.నగరంలో ఉంటున్నాడు. బుధవారం ప్రమాదశాత్తూ చెరువులో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

● చికిత్స పొందుతూ భర్త మృతి.. భార్యకు గాయాలు

భోగాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిపల్లి సమీప జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యా భర్తలకు తీవ్ర గాయాలు కాగా, భర్త పట్టా అప్పన్న(45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన భార్యా భర్తలు విశాఖ జిల్లా మధురవాడ సమీపంలో నివాసం ఉంటున్నారు. కుమారుడు భవానీమాల ధరించడంతో ఇరుముడులు కార్యక్రమానికి మంగళవారం లక్ష్మీపురం వెళ్లారు. అక్కడి నుంచి మరుసటిరోజు బుధవారం దసరా సందర్భంగా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్నారు. పోలిపల్లి సమీప జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలపాలయ్యారు. వారిద్దరినీ హైవే వాహనంలో విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భర్త అప్పన్న మృతిచెందగా, అతని భార్య అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

ఆస్తుల కొనుగోలులో అప్రమత్తం

● జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

చీపురుపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థిరాస్తుల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు సూచించారు. చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రెవెన్యూ పరంగా చీపురుపల్లి కార్యాలయం పని తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. ఆస్తుల కొనుగోలుదారులు తాము కొనుగోలు చేస్తున్న ఆస్తులకు సంబంధించి పత్రాలు, హక్కుదారుల విషయంలో ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలన్నారు. హక్కులేని వారి నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల కొనుగోలుదారులు నష్టపోతారన్నారు. ఇటువంటి సందర్భాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల సవరణలు, దస్తావేజులు రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా కౌలు, కొనుగోలు అగ్రిమెంట్లు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆయన వెంట చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ టీవీకేఎస్ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

కొలువు తీరిన కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ ట్రస్ట్ సభ్యులు

చీపురుపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ ట్రస్టీలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈవో కె.నానాజీబాబు సభ్యులతో ప్రమాణం చేయించారు. ట్రస్టీలుగా గవిడి నాగరాజు, పొట్నూరు త్రినాథరావు, ఎ.లక్ష్మణరావు, లెంక రాధ, జి.సత్యం, ఎం.శ్రీనివాసరావు, ఇప్పిలి పార్వతి, ఎ.భారతి, ఇల్లాపు జయమ్మ, ఎస్.ప్రియాంక, ఎం.రామకిరణ్‌లు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ట్రస్ట్ సభ్యులు కృషి చేయాలన్నారు. గవిడి నాగరాజు మాట్లాడుతూ ఆలయానికి గాలి గోపురం నిర్మాణంలో పెండింగ్‌లో ఉందని, దానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేవదాయ శాఖ తనిఖీ అధికారి జి.శ్యామ్‌ప్రసాద్, టీడీపీ నాయకుడు రౌతు కామునాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దసరా సందడి

(7వ పేజీ తరువాయి)

బాలకృష్ణ బుధవారం ఆదేశించారు. గురువారం గాంధీ జయంతి కావడంతో మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఎటువంటి మాంసం విక్రయాలు చేపట్టదారని వ్యాపారులకు ఆదేశాలిచ్చినట్టు ఆయన తెలిపారు. వాస్తవంగా ఏటా దసరా రోజున సాలూరులో కోటి రూపాయలకు పైబడిన చేపలు, మాంసాహారం విక్రయాలు జరుగుతాయి. అయితే ఈ సారి గాంధీ జయంతి, దసరా ఒకే రోజు పడడంతో మాంసాహార విక్రయదారులకు బ్రేక్ పడింది. మొక్కులు చెల్లించే వారికి కూడా పెద్ద సమస్యే వచ్చి పడింది.

పూజలకు లారీలు సిద్ధం

సాలూరు లారీ పరిశ్రమకు పెట్టింది పేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండో స్థానంలో ఉండేది. పట్టణంలో 2500 వరకు లారీలు ఉన్నాయి. వాటితో పాటు వివిధ రకాల వాహనాలు మరో రెండు వేల వరకు ఉంటాయి. వాటికి దసరా నాడు ప్రత్యేకంగా పూజలు చేయనున్నారు. వాహనాలకు పూజలతో పాటు పొట్టేళ్లను మొక్కుబడిగా చెల్లిస్తారు.

గిరిజన వర్సిటీ సమీపంలో గ్రేహౌండ్ క్యాంపస్

(7వ పేజీ తరువాయి)

తాను సీఎం అయ్యాక రూ.75కి పెంచామన్నారు. ఆ తరువాత వెయ్యికి పెరిగిన పింఛన్‌ను 2024లో అధికారంలోకి వచ్చిన తరువాత రూ.4వేలకు పెంచామన్నారు. ప్రతి నెలా రాష్ట్రంలో ఏదో గ్రామానికి వెళ్లి పింఛన్ పంపిణీని పర్యవేక్షిస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం కింద 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో భాగంగా ఈనెల 4న 2 లక్షల90వేల మందికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. స్త్రీశక్తి పథకం వల్ల నష్టం కలిగిన ఆటో డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో పథకం ఎంతో ఊరట నిస్తుందన్నారు. అన్నా క్యాంటీన్ పథకాన్ని మరింత విస్తరిస్తామన్నారు. అనకాపల్లి వద్ద అర్సలాల్ మిటల్ సంస్థ లక్ష కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు

ప్రాణాలు పోతున్నాయ్!

(7వ పేజీ తరువాయి)



కురుపాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

పాఠశాలలో 611 మంది చదువుతున్నారు. దసరా సెలవుల కోసం ఇళ్లకు వెళ్లే సమయంలో విద్యార్థి నులంతా ఆరోగ్యంగా ఉన్నారు. అయితే వారిలో పువ్వల అంజలికి గత నెల 19న జ్వరం వచ్చింది. వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాం. 20న జ్వరం తగ్గగా తల్లిదండ్రులతో కలిసి ఇంటికి వెళ్లింది.' అని తెలిపారు.

విద్యార్థినులను పరామర్శించిన ప్రభుత్వ విప్

కురుపాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి బుధవారం రాత్రి పరామర్శించారు. డ్యూటీ డాక్టర్‌తో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలిని కోరారు. మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి కూడా విద్యార్థినులను పమర్శించి.. పాఠశాలను పరిశీలించారు.

పాఠశాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో

కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సందర్శించారు. డైనింగ్ రూమ్, ఆర్‌వో ప్లాంట్ పరిశీలించారు. ఆర్‌వో ప్లాంట్ రెండు నెలలుగా పనిచేయడం లేదని , పిల్లలకు వేడి నీరు పిల్లలకు అందిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.అనూరాధ తెలిపారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో ఉన్న ఈ పాఠశాల విద్యార్థినుల ఇళ్లకు ఏఎన్ఎం, ఆశావర్కర్లను పంపించి వారి ఆరోగ్య పరిస్థితులు సేకరించామని డీఎంహెచ్‌వో తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కురుపాం, భద్రగిరి, చిన మేరంగి ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కొందరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఈ పరిస్థితికి గల కారణాలు తెలుసుకోవడానికి క్లూస్ టీమ్ పంపిస్తామన్నారు.

మహిషాసురమర్దినిగా కోటదుర్గమ్మ

(7వ పేజీ తరువాయి)

ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి.. మొక్కులు చెల్లించు కున్నారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జగన్మాతా.. శరణు శరణు



సాలూరులో లక్ష్మీదేవిగా..



వీరఘట్టంలో..



సాలూరు రూరల్: అమ్మవారికి ఉంజల్‌సేవ

సాలూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారు లక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన పూజా మండపంలో బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, నాయకులు మద్ది దొరబాబు, సోనెల రామారావు, లోవరాజు, మన్మథ ఉన్నారు.

●సాలూరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచముఖేశ్వర ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సుబ్బ గురువు పర్యవేక్షణలో సనాతన ధర్మపరిషత్ అధ్యక్షుడు కొలకోటి శంకరరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి రాత్రి ఉంజలొసేవ, రథోత్సవం, తెప్పోత్సవం, సంగీతార్చన నిర్వహించారు.

●పాలకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటదుర్గమ్మ అమ్మవారిని బుధవారం తూర్పు కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆమెతో పాటు తూర్పుకాపు డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, జనసేన నాయకులు అనీల్, రాజేష్ ఉన్నారు.

●వీరఘట్టం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సీఎం సభకు జిల్లా ప్రజాప్రతినిధులు





సీఎంను కలిసిన మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం /సాలూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం దత్తిలో బుధవారం నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును జిల్లా ప్రజాప్రతినిధులు కలిశారు. సీఎంను కలిసిన వారిలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు గొట్టాపు వెంకటనాయుడు తదితరులున్నారు.

8200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊట, సారాతో అధికారులు, సిబ్బంది

పార్వతీపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా అంతర్రాష్ట్ర సరిహద్దులో నిర్వహించిన దాడుల్లో 8200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు మన్యం ఎక్సైజ్ ప్రొహిబిషన్ జిల్లా ఏఈఎస్ సంతోష్ తెలిపారు. బుధవారం జయకోట, బొత్తరాపల్లి, మూలకర్లి, విక్రంపురం గ్రామాల్లో దాడులు బెల్లపు ఊటతో పాటు 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పార్వతీపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, సీతానగరం, పాలకొండ ఎక్సైజ్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

త్వరలో రైతు బజారు వినియోగంలోకి..



అధికారులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్

సాలూరు, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజారును వినియోగంలోకి తెచ్చేందుకు ఏఎంసీ పాలక మండలి అడుగులు వేస్తోంది. పట్టణంలోని దండిగాం రోడ్డులో 2019లో సుమారు రూ.39 లక్షలతో రైతు బజారును నిర్మించింది. అయితే దాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కనీసం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎంసీ చైర్మన్‌గా ఎం.సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఏఎంసీ తొలి సమావేశంలోనే పట్టణంలో నిర్మించిన రైతు బజారును వినియోగంలోకి తెచ్చేందుకు తీర్మానం చేశారు. అందుకు అనుగుణంగా మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్, పట్టణ సీఐ అప్పలనాయుడులతో కలిసి బుధవారం ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ రైతు బజారును పరిశీలించారు. పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు రైతు బజారును ఆధునీకీకరించేందుకు నిర్ణయించారు. పట్టణంలో మెయిన్ రోడ్డుతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపం, శివాజీ బొమ్మ, బోసు బొమ్మల దరి కూరగాయల వ్యాపారులను రైతు బజారుకు తరలించేందుకు కార్యాచరణ రూపొందించారు. త్వరలో రైతు బజారులోనే కూరగాయల విక్రయాలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. కూరగాయలు విక్రయించే వారికి గుర్తింపు కార్డులతో పాటు వారికి షాపులను కూడా కేటాయిస్తామన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూర్యనారాయణ కోరారు.

వీరఘట్టంలో సెంటర్ లైటింగ్



విద్యుత్ కాంతులతో మెయిన్ రోడ్డు

వీరఘట్టం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రధాన రహదారిలో సెంటర్ లైటింగ్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కృషితో సుడా నుంచి చైర్మన్ కొరికాన రవికుమార్ నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తికావడంతో లైటింగ్ ట్రయల్ రన్ బుధవారం నిర్వహించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

పాలకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19వ వార్డు సచివాలయం కస్పావీధిలో సామాజిక పింఛన్లను ఏఎంసీ డైరెక్టర్ యామల రత్నకుమారి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. నిగరాంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట కోసం ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, కుక్కిడి సర్పంచ్ బిడ్డిక రాజారావు, బీజేపీ మండల కన్వీనర్ కడ్రక అప్పలస్వామి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ శేఖరం, పంచాయతీ కార్యదర్శి ఆరిక హేమభార్గవి, నాయకులు పద్మావతి, రామారావు, నిమ్మక కళావతి, బిడ్డిక సత్యం, మండంగి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారతే లక్ష్యం

పార్వతీపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల ఆర్థిక సాధికారితే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పీఎం స్వానిధి కార్యక్రమంలో భాగంగా వీధి వ్యాపారులతో బుధవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా మహమ్మారి తర్వాత వీధి వ్యాపారుల ఆర్థిక ఇబ్బందులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అందుకే వారిని పూర్తిస్థాయిలో ఆదుకోనేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. వ్యాపారాల అభివృద్ధికి బ్యాంకులు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నా యన్నారు. అనంతరం వీధి వ్యాపారులకు మంజూరైన రుణ ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రాజు, మెప్మా పీడీ కృష్ణారావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు వైద్యుల నియామకం

గరుగుబిల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలువురు వైద్యులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పీహెచ్‌సీలకు డిప్యూటేషన్‌పై వైద్యులను డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు బుధవారం నియమించారు. సీతానగరానికి బి.సుశీల, రావివలసకు ఎ.సాయిప్రసాద్, బందలుప్పికి ఎం.శ్రీనివాసరావు, కేఆర్‌బీపురానికి బి.భరత్ సుభాషిణి, పెదబొండపల్లికి మౌనిక, బలిజిపేటకు ఎల్.రామకృష్ణను నియమించారు. డోకిశీల పీహెచ్‌సీకి కె.స్వాతి, వీరఘట్టంకు జి.ఆశాలత, ఎం.సింగుపురానికి ఎస్.రాజీవ్, అన్నవరానికి టి.మహేశ్వరి, బత్తిలికి ఎం.విజయ్, తోణాం కు వై.సాగర్ కృష్ణ, బాగువలసకు వై.ఉదయ్, సాలూరు పీపీ యూనిట్‌కు జె.పావని, దోనుబాయికి బి.పవన్‌కుమార్, కుశిమికి బి.దిలీప్‌కుమార్, మర్రిపాడుకు ఎస్.సుమంత్, భామినికి జి.గిరీష్, తాడికొండకు ఆర్ఆర్‌కే చైతన్య, కొమరాడకు చంద్, అరసాడకు ప్రభాతేజ ప్రసాద్ లను నియమించారు. బాలేరుకు విశ్వ, దుడ్డు ఖల్లుకు నిహారిక, జియ్యమ్మవలసకు సింగ్, గళావల్లికి, అభిలాష్ పావని.. గరుగుబిల్లికి డాక్టర్ అవినాష్, కాసులవర్మ... మామిడిపల్లికి ఎం.చైతన్య, లలిత.. నీలకంఠాపురానికి జి.తిరుపతిరావు, పాచిపెంటకు మోహన్‌కుమార్, శేఖర్.. పెదంకలానికి బి.శ్రీకాంత్, హేమాక్షి... రేగిడికి సూర్యసందీప్, రత్నం.. మక్కువకు జీఎస్ నిఖిల్, మహేష్. మాదలంగి పీహెచ్‌సీలకు సూర్యతేజ, శిరీష్‌లను డీఎంహెచ్‌వో నియమించారు.

రాత్రి విద్యుత్ సరఫరా ఇవ్వండి

సాలూరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డొంకల వెలగవలసకు రాత్రి పూట విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఈపీడీసీఎల్ డీఈ ప్రసన్నకుమార్‌ను స్థానికులు కోరారు. బుధవారం ఆయన కార్యాలయానికి స్థానికులు వెళ్లి తమ సమస్యను వివరించారు. కొద్దిరోజులుగా రాత్రిళ్లు అంధకారంలో ఉంటున్నామన్నారు. పగటి పూట ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల తదుపరి మళ్లీ ఉదయం వరకు విద్యుత్ సరఫరా ఉండటం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని డీఈని వారు కోరారు. ఇందుకు సానుకూలంగా డీఈ స్పందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు.

మాలతమ్మ గుడికి భక్తుల తాకిడి

కురుపాం రూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): నేరేడువలసలో మాలతమ్మను గుడికి బుధవారం భక్తుల తాకిడి పెరిగింది. విజయదశమి సందర్భంగా గురువారం అమ్మవారికి పండుగ నిర్వహించనున్నారు. వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి రానున్నారు. బుధవారం ఎల్విన్‌పేట సీఐ బి.హరి మాలతమ్మ గుడి వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. కురుపాం ఎస్ఐ నారాయణరావుకు తగు సూచనలు ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మాలతమ్మ పండగకు వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి కోరారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం నేరేడువలస వద్ద మాలతమ్మ పండుగ నేపథ్యంలో వాహనాల రద్దీ ఉంటుందన్నారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మీదుగా రాయగడ వైపు వెళ్లే ప్రయాణికులు పార్వతీపురం మీదుగా వెళ్లాలన్నారు. భక్తుల వాహనాలను నేరేడువలస జంక్షన్‌కు 200 మీటర్ల దూరంలో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం నేరేడువలస, టిక్కబాయి మీదుగా వెళ్లాలని సూచించారు.

బొబ్బిలి కోటలో ఆయుధ పూజకు ఎమ్మెల్యే



ఆయుధపూజకు హాజరైన ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలో బుధవారం ఆయుధ పూజ అంగరంగ వైభవంగా జరిగింది. రాజవంశీయులైన మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు, సోదరులు రామకృష్ణరంగారావు, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)తో కలిసి ఈ ఆయుధ పూజను స్థానిక దర్బార్ మహల్‌లో చేపట్టారు. ఈ పూజా ప్రక్రియను తిలకించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చారు. చారిత్రక బొబ్బిలియుద్ధంలో నాటి రాజులతో పాటు, బొబ్బిలి వీరునిగా పేరుగాంచిన తాండ్ర పాపారాయుడు, ఇతర సైన్యం వినియోగించిన తుపాకులు, కత్తులు, డాళ్లకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విజయచంద్ర

పార్వతీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్య క్రమాలు, పథకాలను జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు.

కిడ్నీ బాధితులకు పింఛన్లు

బెలగాం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులకు బుధవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. అలాగే 21వ వార్డులో రోగులు, వితంతవులకు ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలభిషేకం

పార్వతీపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక భరోసా కల్పించిన సీఎం చంద్రబాబుకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరై మాట్లాడారు. 15 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో తాగునీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు రూ.12 వేలు జీతం ఇచ్చేవారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో కార్మికులు తమకు జీతాలు పెంచాలని, నిరసనలు, ధర్నాలు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కార్మికులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారన్నారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు వారి జీతాలను రూ.12 వేల నుంచి రూ.18,500లకు పెంచారని వివరించారు.

రేపటి నుంచి రీ సర్వే

పార్వతీపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 3 నుంచి భూముల రీ సర్వే నిర్వహించనున్నట్లు జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 43 గ్రామాల్లో 60 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా రైతుల ఆధ్వర్యంలోనే పక్కాగా ఈ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ

పాలకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగులు నిజాయితీ చాటారు. బస్సులో మరిచిపోయిన రూ.50 వేలు విలువైన నాణేల ప్యాకెట్లను సదరు ప్రయాణికుడికి బుధవారం అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. రాజాం మండలం మెంతిపట గ్రామానికి చెందిన మారం కేశవరావు పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం రాజాం బస్సు ఎక్కాడు. రూ.50 వేలు విలువైన నాణేలు ఉన్న రెండు ప్యాకెట్లను బస్సులో మరచిపోయి దిగిపోయాడు. విధుల్లో ఉన్న ఆర్టీసీ కంట్రోలర్.. ఆ ప్యాకెట్లను గమనించి వాటిని డిపో సెక్యూరిటీకి అందజేశారు. కేశవరావు బస్సులో మరిచిపోయిన ప్యాకెట్ల విషయం ఆర్టీసీ అధికారులకు తెలియజేశాడు. దాంతో జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వాటిని సదరు వ్యక్తికి అందజేశారు.

లోవగూడలో ఏనుగులు

భామిని, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోవగూడ ప్రాంతానికి బుధవారం ఏనుగులు చేరాయి. ఉదయానికి వరిపొలంలో సంచరిస్తుంటంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. ఇసుకగూడ ప్రాంతంలో ఏనుగులు గత వారం రోజులు సంచరించి మొక్కజొన్న, వరి పొలాలు నాశనం చేశాయి. ఈ ప్రాంతంలో కూడా ఏనుగులు పంటలు నాశనం చేస్తాయని భయపడుతున్నారు. ఏనుగుల సంచారంతో ఇసుకగూడ, సన్నాయిగూడ డోకులగూడ గ్రామాలకు వెళ్లేందుకు వెనుకంజ వేస్తున్నారు.

వృద్ధులకు వైద్యసేవలు అందించండి

పార్వతీపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు సేవాభావంతో వైద్య సేవలందించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. బుధవారం పట్టణంలోని జగన్నాథపురం యూహెచ్‌సీలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఆరోగ్యంతో పాటు శారీరక, మానసిక సమస్యలను గుర్తించి వారికి సరైన చికిత్సను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వృద్ధులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి సూచించారు. బుధవారం గరుగుబిల్లిలో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాల్లో ఈ నెల 16వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కృష్ణవేణి, ఎం.పద్మావతి, ఎం.సావిత్రి, జి.పద్మ తదితరులున్నారు.